# మనవి

ప్రవక్త ముహమ్మద్ﷺ చేసిన ఆరాధన విధానం ప్రకారం ఈ పుస్తకమం తయూ కూర్పు చేయడం జరిగింది. ఆయన చెప్పినట్లుగా, చేసినట్లుగా ప్రామాణికమైన హదీసుల వెలుగులో నమాజు మరియు అంత్యక్రియలు జరిపే విధానాలను, ఇంకా మృతుని మేలు కొరకై ఇతరులు చేయవలసిన పుణ్యకార్యాలను కూడా ఈ పుస్తకంలో పొందు పరిచాము. **అలాగే ఆరాధనల మరియు అంత్యక్రియల విధానాలలో అనేక 'బిద్అత్' కార్యాలను జొప్పించి పాటిస్తున్న విషయాల గురించి హెచ్చరించడం కూడా జరిగింది. కనుక ప్రజలందరూ ఈ పుస్తకంలో ఉన్న విధానాల ప్రకారం ఆచరిస్తే ప్రవక్త ముహమ్మద్ﷺ విధేయతకు అనుగుణంగా ఆచరించిన ఆరాధన విధానం అవుతుంది.**

ముస్లిం ప్రజలు విభిన్న వర్గాలకు గురికాబడినందున ప్రవక్త ముహమ్మద్ﷺ విధేయతకు దూరం కాబడుతున్నారు. మరియు ప్రామాణికమైన హదీసుల ద్వారా ప్రచురించబడిన **'సున్నత్' కార్యాలను అనుసరించకుండా, వారు నమ్ముకున్న వర్గాల ఇమాముల విధేయతను పట్టుదలగా అనుసరిస్తున్నారు. మరియు ఆరాధన పరంగా ఉన్న ముహమ్మద్ﷺ యొక్క సాంప్రదాయాల (సున్నతుల)ను అపచారాలుగా భావించి వాటిని అనుసరించడం లేదు.**

ఎవరైతే వర్గాలకు అతీతంగా నిజమైన హదీసులను ప్రవక్త ముహమ్మద్ﷺ సాంప్రదాయం (సున్నతు)గా భావించి అనుసరిస్తున్నారో, వారిని అనేక రకాలుగా తప్పు పడుతున్నారు. మరియు ఒక ప్రత్యేకమైన వర్గానికి కట్టుబడి ఉండాలని అమాయకంగా వాదిస్తున్నారు.

అలా వారి వాదన సరికాదనీ హజ్రత్ ముల్లా అలీ ఖారీ హనఫీ గారు తమ పుస్తకంలో **''షర్హ్ అయ్‌నుల్ ఇల్మ్, మొదటి సంపుటం పేజి నెంబరు 446'' లో** మరియు హజ్రత్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ అజీజ్ మక్కి హనఫీ **''అల్ ఖౌలుస్ సదీద్ ఫీ బాజి మసాయిలిల్ ఇజ్‌తిహాద్ వత్‌తఖ్లీద్''** అనే పుస్తకాలలో ఇలా తెలియజేసారు: **''హనఫీ, షాఫయీ, మాలికీ మరియు హంబలీ అనే వర్గాలకు ప్రజలు కట్టుబడి ఉండాలని అల్లాహ్ అజ్ఞాపించ లేదు.** కాని ప్రవక్త **ముహమ్మద్ﷺ విధేయతకు కట్టుబడి ఉండాలని అల్లాహ్ ఆదేశించాడు''** అని తెలియజేసారు.

ఇమాములందరూ కూడా ప్రవక్త ముహమ్మద్ﷺ గారి ప్రామాణికమైన హదీసులనే అనుసరించవలసిందిగా తెలియజేసారు. కనుక **హజ్రత్ ఇమామ్ అబూ హనీఫా (رحمة الله عليه) గారు ఇలా బోధించారు:**

''ఏ హదీసు సహీహ్ (నిజమైనదో) ఉందో అదే నా (నా మార్గం పద్ధతి) మజ్‌హబు'' **మరొకచోట ఇలా తెలియజేసారు:** ''నా మాట సహీహ్ హదీస్‌కు వ్యతిరేకంగా ఉంటే దానిని గోడకు విసరి కొట్టండి''

(ఇబ్నే ఆబిదీన్1/63, ఝుఖాజుల్ హమమ్:62)

అలాగే ఇమావ్ షాఫయి, అహ్మద్ బిన్ హమ్బల్, (رحمة الله عليهم) మరియు అనేక ఇమాముల, ధర్మ గురువుల ఆదేశాలు కూడా ప్రామాణికమైన హదీసుల ప్రకారమే ఆచరించవలసిందిగా ఆజ్ఞాపించారు.

ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: **''ఏ విధంగా నన్ను నమాజ్ చేస్తుండగా మీరు చూసారో ఆ విధంగానే నమాజ్ చేయండి''**

(బుఖారీ).

https://teluguislam.net


అందుకని ధార్మిక పండితులు (మౌల్వీలు,ఇమాములు) ప్రజలకు **ఖుర్ఆన్ మరియు సహీహ్ హదీసుల ప్రకారం ధర్మజ్ఞానం బోధించడానికి ప్రయత్నం చేయాలి.** మరియు ప్రజలు కూడా వాటినే అనుసరించాలి. అది ఆ ఇమామ్ వారి దగ్గర జాయజ్, ఇది ఈ ఇమామ్ వారి దగ్గర జాయెజ్ అని బోధిస్తూ ప్రజలను నిజమైన హదీసుల ఆచరణకు మరియు ప్రవక్త ముహమ్మద్ﷺ విధేయతకు దూరం చెయ్యకండి. అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

**وَلْتَكُنْ مِنْكُمْ أُمَّةٌ يَدْعُونَ إِلَى الْخَيْرِ وَيَأْمُرُونَ بِالْمَعْرُوفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنْكَرِ وَأُولَئِكَ هُمُ الْمُفْلِحُونَ (104) وَلا تَكُونُوا كَالَّذِينَ تَفَرَّقُوا وَاخْتَلَفُوا مِنْ بَعْدِ مَا جَاءَهُمُ الْبَيِّنَاتُ وَأُولَئِكَ لَهُمْ عَذَابٌ عَظِيمٌ .**

''మేలు వైపుకు పిలిచే, మంచిని చెయ్యమని ఆజ్ఞాపించే, చెడుల నుంచి వారించే ఒక వర్గం మీలో ఉండాలి. ఈ పనిని చేసేవారే సాఫల్యాన్ని పొందుతారు.- తమ వద్దకు స్పష్టమయిన నిదర్శనాలు వచ్చేసిన తరువాత కూడా వర్గాలుగా విడిపోయి, విభేదించుకున్నవారి మాదిరిగా మీరు తయారవకండి. మహాశిక్ష ఉన్నది ఇటువంటివారి కోసమే.

(ఆలి ఇమ్రాన్: 104-105).

ఇలా ఇమాముల పేర్లపైన ముహమ్మద్ﷺ ఆచారాలను, బోధనలను కొన్ని వర్గాలకు పరిమితం చేయకూడదు. ఇలా చేయడం న్యాయం మరియు ధర్మం కూడా కాదు. అలా చేస్తే అల్లాహ్ సమక్షంలో జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. కనుక ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా తెలియజేసారు:

''మీలో ప్రతి ఒక్కడు సంరక్షకుడే, మీ సంరక్షణలో ఉన్నవారిపట్ల మీలో ప్రతి ఒక్కరిని అడగటం జరుగుతుంది'' (బుఖారీ, ముస్లిం).

జఫరుల్లాహ్ ఖాన్ నద్వీ

తిరుపతి (కువైట్)